క్లుప్తంగా

గోదాదేవికి ప్రత్యేక అభిషేకం



పెనమలూరు: మండలంలోని పోరంకి గ్రామం లక్ష్మీపురం కాలనీలో వేంచేసి ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీ గోదాదేవి అమ్మవారికి తిరు నక్షత్రం సందర్భంగా ప్రత్యేక అభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

డాక్టర్ బీఎస్ రావుకు నివాళి



కంకిపాడు: శ్రీచైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎస్ రావుకు ఆయన కుమార్తె బొప్పన సుష్మ, శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ పుష్ప నివాళులర్పించారు. పునాదిపాడులోని శ్రీచైతన్య గోసాల శ్రీవైభవి క్యాంపస్‌లో బీఎస్ రావు సంతాప సభ శనివారం నిర్వహించారు. సుష్మ, పుష్ప హాజరై బీఎస్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీచైతన్య గోసాల క్యాంపస్ స్థాపించిన నాటి నుంచి వివిధ విభాగాల్లో పనిచేసిన దిగువ స్థాయి ఉద్యోగులకు నగదు అందజేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్స్, ఏజీఎం, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఏసీల బహూకరణ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ అన్నదానం హాలుకు దాతలు రెండు ఏసీలను శనివారం బహూకరించారు. ప్రసాదంపాడుకు చెందిన బండి లక్ష్మి కుమార్తె కిలారి యశస్వి (ఆస్ట్రేలియా) ఈ ఏసీలను సమర్పించారు. ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఈఓ పి.లోకేశ్వరి దాతలకు అమ్మ వారి ప్రసాదాలు అందజేశారు.

దాతల సహకారం భేష్

గన్నవరం రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అభినందనీయమని సూరంపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం హరిశరణ్ అన్నారు. శనివారం స్థానిక పాఠశాల విద్యార్థులకు చుక్కపల్లి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి చుక్కపల్లి సుధ రూ.25 వేల విలువైన ఆట వస్తువులు, క్రీడా పరికరాలను వ్యాయామ ఉపాధ్యాయిని శాంతి కిరణ్‌కు అందజేశారు.

ముగిసిన యోగా శిక్షణ



కంకిపాడు: స్థానిక ఆర్యవైశ్యకల్యాణ మండపంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం గోసాల శాఖ ఆధ్వర్యంలో యోగ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి యోగాచార్యుడు మండ్రు శ్రీనివాసరావు గురూజీ హాజరయ్యారు. యోగతో లభించే ప్రయోజనాలు, ఆరోగ్యవృద్ధిని ఆయన వివరించారు. నిర్వాహకులులు నేరెళ్ల తులసీ కృష్ణ, కొక్కిలిగడ్డ వెంకటకృష్ణ, ఆత్మకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మానసిక వికాస కేంద్రానికి ఇంపాక్టియర్స్ క్లబ్ చేయూత

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీకి చెందిన స్పందన మానసిక వికాస కేంద్రం భవన నిర్మాణానికి ఇంపాక్టియర్స్ క్లబ్ చైర్మన్, ప్రవాసాంధ్రుడు కృష్ణ జవ్వాజి రూ.75 వేల విరాళం ఇచ్చారు. క్లబ్ డైరెక్టర్ హేమ్ అప్పన విరాళం చెక్‌ను శనివారం సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్‌కు అందజేశారు. హేమ మాట్లాడుతూ.. లాభాపేక్ష లేకుండా దివ్యాంగులకు సేవలందిస్తున్న ఈ కేంద్రం నూతన భవన నిర్మాణానికి తమ వంతు సాయం చేసినట్లు తెలిపారు.

జాతీయ జెండా ఆమోద దినోత్సవం

పెనమలూరు: మండలంలోని కానూరులో శనివారం జాతీయ జెండా ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. అశోక్ జిమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ మాట్లాడుతూ త్రివర్ణ పతాకాన్ని రాజ్యాంగ సభ 1947 సంవత్సరం జూలై 22వ తేదీన జాతీయ పతాకంగా ఆమోదించిందన్నారు. పింగళి వెంకయ్య జాతీయ జెండాను రూపొందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాడీబిల్డింగ్ క్రీడాకారులు షాజిత్, మాతృహృదయ్ సేవా సంస్థ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

12న వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ

కంకిపాడు: వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా 23వ మహాసభ ఆగస్టు 12న ఈడుపుగల్లులో జరుగుతుందని సంఘం నాయకుడు మేరుగు విజయ్‌కుమార్ తెలిపారు. సంఘం సబ్ కమిటీ సమావేశం కంకిపాడులోని సంఘ కార్యాలయంలో శనివారం జరిగింది. సీపీఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి తాతయ్య, నాయకులు మున్నంగి నరసింహారావు, పోతురాజు నాగేశ్వరరావు, బండి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

డీఈఓ తాహెరా సుల్తానా



ఈడుపుగల్లులో విద్యార్థులకు సెమిస్టర్-2 పుస్తకాలను అందజేస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా, ఉపాధ్యాయులు

కంకిపాడు: ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) తాహెరా సుల్తానా ఆదేశించారు. మండలంలోని ఈడుపుగల్లు, కంకిపాడు జిల్లా పరిషత్ పాఠశాలల్లో సెమిస్టర్ -2 పాఠ్యపుస్తకాల పంపిణీని శనివారం ఆమె ప్రారంభించారు. కంకిపాడు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం షెడ్ పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని సమర్థంగా అమలు చేస్తోందన్నారు. విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనా పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించాలని, హాజరు శాతం పెంచేలా మరింత బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యా ప్రగతిలో నిర్లక్ష్యంగా ఉంటున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, కౌన్సిలింగ్‌లు అందించాలన్నారు. పదో తరగతి ఫలితాలపై దృష్టి పెట్టాలని, నూరుశాతం ఫలితాలు సాధించాలని స్పష్టంచేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పెనమలూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా సూచించారు. మండలంలోని వణుకూరు పాఠశాలలో ఆమె శనివారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, జగనన్న గోరుముద్ద ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు నిత్యం యూనిఫామ్ ధరించి పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. మండలంలో అన్ని పాఠశాలలో సెమ్-2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశామని తెలిపారు. ఎంఈఓ కనకమహాలక్ష్మి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బస్‌పాసులు పంపిణీ చేస్తున్న సర్పంచి చక్క విజయ, ఉపసర్పంచి గద్దల రాజా

సెమ్-2 పుస్తకాల పంపిణీ

పెనమలూరు: మండలంలోని వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సెమ్-2 పుస్తకాలు సర్పంచి చక్క విజయ, మండల విద్యాశాఖ అధికారి-2 కనకమహాలక్ష్మి శనివారం పంపిణీ చేశారు. సర్పంచి చక్క విజయ మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు ఉచింతగా అందిస్తోందన్నారు. విద్యార్థులు లక్ష్యం కోసం చదవాలని సూచించారు. ఉపసర్పంచి గద్దల రాజా సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు అందచేశారు. సొసైటీ అధ్యక్షుడు వేమూరి రాజా, సచివాలయం ఇన్‌చార్జ్ వల్లే నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటర్ల సర్వే



నున్న గ్రామంలో ఓటర్ల సర్వేలో వీఆర్వోలు

నున్న(విజయవాడ రూరల్): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్ల సర్వే కార్యక్రమం శనివారం చురుగ్గా జరిగింది. గన్నవరం నియోజకవర్గం పరిధిలో అంబాపురం, పి.నైనవరం, పాతపాడు, నున్న, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా అర్హులను కొత్త ఓటర్లుగా నమోదు చేశారు. 51 వేల 428 మంది పురుషుల ఓటర్లు, 53వేల 142 మంది మహిళా ఓటర్లు, ఇతరులు ఏడుగురు చొప్పున ఉన్నారని డెప్యూటీ తహసీల్దారు గోపాలరెడ్డి తెలిపారు. గ్రామాల్లో 77 పోలింగ్ కేంద్రాలకు 77 మంది బూత్‌స్థాయి అధికారులు (వీఆర్వోలు) ఓటర్ల సర్వేలో పాల్గొన్నారు. మైలవరం నియోజకవర్గం పరిధిలో గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి, షాబాదు, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లో 23 వేల 856 మంది పురుషుల ఓటర్లు, 25 వేల 723 ఓటర్లు మహిళా ఓటర్లు, ఎనిమిది మంది ఇతరులు ఉన్నారని అధికారలు తెలిపారు. ఓటర్ల సర్వేలో బీఎల్ఓలతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

విద్యార్థులకు జామెంట్రీ బాక్సుల పంపిణీ

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు శనివారం పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల జేసీఎస్ కన్వీనర్ వింత ఆదినారయాణరెడ్డి(నాని) మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలు అందరినీ చదివించాలన్న లక్ష్యంతో వారికి అవసరమైన యూనిఫాం, పుస్తకాలు, బ్యాగు, బూట్లు, బెల్టులను రాష్ట్ర ప్రభుత్వం వారికి సమకురుస్తోందని చెప్పారు. ప్రభుత్వ సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సర్పంచ్ లాం దిబోర, గ్రామ పెద్దలు వింత గిరిధర్‌రెడ్డి, తియ్యగూర రామిరెడ్డి, హాస్టల్ వార్డెన్ శ్రీను పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పెరికీడులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



కంకిపాడులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న రాజ్యలక్ష్మి, బాకీబాబు తదితరులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులో శనివారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. సర్పంచ్ పల్లపోతు జాన్ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. నూరుశాతం సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాజకీయ వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. గతంలో కులం, ఆదాయం, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు జగనన్న సురక్ష ద్వారా వలంటీర్లతో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నారని చెప్పారు. 562 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు, 432 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఐదుగురికి కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు అందించారు. 50 మంది ధార్ కార్డులకు ఫోన్ నంబర్లు లింక్ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ పండు రాణి, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహామూర్తి, ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు, డెప్యూటీ తహసీల్దార్ కె.వెంకట రమణ పాల్గొన్నారు.

సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

కంకిపాడు: ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వాన్ని మరో సారి ఆశీర్వదించాలని వక్తలు పిలుపునిచ్చారు. కంకిపాడు-1 సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరం శనివారం జరిగింది. 1,055 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సంక్షేమంలో రాజీ పడకుండా, రాజకీయాలకు తావులేకుండా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ బాకీ రమణ, మండల ప్రత్యేకాధికారి షాహిద్‌బాబు, తహసీల్దార్ పి.ఎస్.వి.ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్, రామారి చిరంజీవి, చిట్టూరి ప్రసాద్, మేడంద్రావు కుటుంబరావు, ఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో తమ దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరిస్తున్నామని తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. యనమలకుదురు సచివాలయం-4లో శనివారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. ఈ సందర్భంగా 2,274 సర్టిఫికెట్లు పంపిణీచేశారు. అసిస్టెంట్ కమిషనర్ అవినేష్, వైఎస్సార్ సీపీ నేత కర్రా ఆదిశేషారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కెనరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ మ్యాచ్‌లను పార్రంభించిన కెనరా బ్యాంక్ జీఎం రవివర్మ, వీఆర్ సిద్ధార్థ ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

పెనమలూరు: క్రీడలతో మానసిక ఒత్తిడికి దూరంగా ఉండొచ్చని కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ పి.రవివర్మ పేర్కొన్నారు. కెనరా బ్యాంక్ ఉద్యోగులకు కెనరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో శనివారం ప్రారంభించి ప్రసంగించారు. క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి దూరమవడమే కాకుండా క్రమశిక్షణతో కూడిన జీవితం గడపవచ్చని సూచించారు. కెనరా బ్యాంక్ ఉద్యోగులకు పని ఒత్తడి లేకుండా చేయటానికి యాజమాన్యం దేశవ్యాప్తంగా సర్కిళ్ల పరిధిలో పురుష ఉద్యోగులకు క్రికెట్ పోటీలు, మహిళలకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఉద్యోగులు కూడా పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.వి.రత్నప్రసాద్, డీన్ బావినేని పాండురంగారావు, కెనరా బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో 13 జట్లు

కెనరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలో 13 జట్లు పాల్గొన్నాయి. మొదటి రోజు విజయవాడ సర్కిల్ జట్టు కాకినాడ ఆర్ఓ జట్టుపై, వైజాగ్ 2 ఆర్ఓ జట్టు కర్నూల్ ఆర్ఓ జట్టుపై, నెల్లూరు ఆర్ఓ జట్టు వైజాగ్ ఆర్ఓ1 జట్టుపై, విజయవాడ ఆర్ఓ జట్టు ఒంగోలు జట్టుపై గెలుపొందాయి. ఆదివాకం కూడా పోటీలు కొనసాగుతాయి.

'ఆడుకుందాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

గన్నవరం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆడుకుందాం.. ఆంధ్ర'ను విజయవంతం చేయాలని ఎంపీడీఓ సత్య కుమార్ తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఆడుకుందాం ఆంధ్ర కార్యక్రమంపై మండల స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడాంశాల్లో సచివాలయ స్థాయి నుంచి మండల స్థాయిలో జరిగే ఈ పోటీలకు 17 ఏళ్ల దాటిన యువతి, యువకులు అర్హులుగా పేర్కొన్నారు. ఈ పోటీల నిర్వాహణకు అనుగుణంగా పాఠశాలలోని క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేయాలని, గ్రామ, మండల స్థాయిలో ఉత్తమ జట్లను ఎంపిక చేయాలని సూచించారు. మండల క్రీడాభివృద్ధి అధికారి ధనియాల నాగరాజు, సచివాలయ కార్యదర్శులు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈశాన్య రాష్ట్రాల్లో మారణహోమం ఆపాలి

కంకిపాడు: ఈశాన్య రాష్ట్రాల్లో జరుగుతున్న మారణహోమాన్ని ఆపేలా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీవీ రావు మాలమహానాడు ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మణిపూర్‌లో కుకి, నాగ ఆదివాసీ క్రిస్టియన్ సమాజంపై బీజేపీ మద్దతుదారులు హత్యాకాండకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల ఉల్లంఘన ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షుడు పి.రామకృష్ణ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ గన్నవరంలో..

గన్నవరం: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన సంఘటన దేశానికే అవమానమని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. మణిపూర్ సంఘటనకు నిరసనగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం గన్నవరంలో విద్యార్థులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ కార్యదర్శి చిల్లర రాజేష్, ప్రజాసంఘాల నేతలు ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, జయమ్మ, మరియమ్మ, రాణి, సల్మా తదితరులు పాల్గొన్నారు.

చీరల చోరీపై కేసు నమోదు

పెనమలూరు: ముగ్గురు మహిళలు వచ్చి షాపులో చీరలు చోరీ చేశారని షాపు యజమానురాలు రావి ఇందిర ఫిర్యాదు చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. పోరంకి మహాలక్ష్మీనగర్‌కు చెందిన రావి ఇందిర, వెంకటప్రసాద్ దంపతులు పెనమలూరు సెంటర్‌లో శ్రీసాయి శారీహౌస్ పేరిట షాపు నిర్వహిస్తున్నారు. గురువారం ముగ్గురు మహిళలు షాపునకు వచ్చి చీరలు బేరమాడి కొనకుండా వెళ్లారు. ముగ్గురు మహిళలు వెళ్లిన తరువాత షాపులో చీరలు చూసుకోగా రూ.58 వేల విలువ చేసే చీరలు కనిపించలేదు. షాపులోకి వచ్చిన మహిళలు చీరలు చోరీ చేశారని బాధితురాలు రావి ఇందిర పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెనమలూరు: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. యనమలకుదురు పుట్టరోడ్డుకు చెందిన సిరియాల సరోజినికి కొద్ది సంవత్సరాల క్రితం ఆటోనగర్‌లో పౌండ్రీ పనులు చేసే శ్రీనుతో వివాహమైంది. శ్రీను దురలవాట్లకు బానిసగా మారాడు. పనులు సక్రమంగా చేయక పోవటంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో శ్రీను ఈ నెల 14వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో సరోజిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

తాతినేనిని సత్కరించిన మండల అధికారులు



పెనమలూరు: కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్‌గా నియమితులైన తాతినేని పద్మావతిని మండల అధికారులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. అధికారులు తాతినేని పద్మావతి ఇంటికి వెళ్లి ఆమెకు శాలువ కప్పి అభినందనలు తెలిపారు. తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఎంపీడీఓ సునీతాశర్మ, ఏఓ లోయ శివశంకర్‌రావు, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

1 నుంచి ఇంటి వద్దకే పౌష్టికాహారం

గన్నవరం: గర్భిణులకు ఆగస్టు ఒకటో తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇంటి వద్దకే పౌష్టికాహారం పంపిణీ చేస్తారని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి తెలిపారు. స్థానిక చింతలపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో పి.వెంకటలక్ష్మితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న ఆహారం, ఆరోగ్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎలిజబెత్‌రాణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు పరిమితమైన పౌష్టికాహార పంపిణీని గర్భిణుల సౌలభ్యం దృష్ట్యా వారి ఇంటి వద్దకే అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.జ్యోతి, బి.అరుణకుమారి, పేర్ని, మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

భార్య వేధింపులు తాళలేక వ్యక్తి అదృశ్యం

పెనమలూరు: తనపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసి వేధిస్తోందని ఓ భర్త ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. గంగూరు గ్రామానికి చెందిన అబ్దుల్‌రఖీబ్ ఏడు సంవత్సరాల క్రితం మచిలీపట్నానికి చెందిన షాజహాన్‌ను వివాహం చేసుకున్నాడు. అబ్దుల్ రఖీబ్ వెల్డింగ్ పనులు చేస్తాడు. వారికి ఇద్దరు పిల్లలు. భార్యాభర్తల మధ్య గొడవలు రావటంతో ఇటీవల షాజహాన్ పుట్టింటికి వెళ్లి భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. మనస్తాపానికి గురైన అబ్దుల్ రఖీబ్, తనను భార్య, అత్తింటివారు వేధిస్తున్నారని, తన కోసం వెతకవద్దని రెండు రోజుల క్రితం లేఖ రాసి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అబ్దుల్ రఖీబ్ సోదరి షాహీనా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


సీఏ విద్యార్థినికి ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే మానవత సేవా సంస్థ కృషిచేస్తోందని సంస్థ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో ఇందిరానగర్‌కు చెందిన సీఏ విద్యార్థిని టంకసాల నందినీదుర్గకు రూ.11 వేల నగదును శనివారం అందజేశారు. 965 మార్కులతో ఇంటర్‌మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన నందినీదుర్గ సీఏ చదవాలనే పట్టుదలతో ఫౌండేషన్ ఎగ్జామ్‌కు తర్ఫీదుపొందుతోంది. ఎగ్జామినేషన్ ఫీజు చెల్లించేందుకు మానవత సంస్థ ఆర్థిక సాయం చేసింది. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ బాధ్యులు సుబ్బాచారి, కోళ్లపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉయ్యూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) సూచించారు. మునిసిపల్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య, పారిశుద్ధ్య సిబ్బందితో సీజనల్ వ్యాధులపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ వల్లభనేని నాని మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మురుగు నిల్వ ఉండకుండా పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు. దోమల మందు పిచికారీ విధిగా చేయాలన్నారు. మునిసిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు కుక్కకు వర్ధంతి



హనుమాన్‌జంక్షన్ రూరల్: ఓ రైతు అప్యాయంగా పెంచుకున్న శునకం చనిపోతే ఇంటి వద్ద జ్ఞాపకార్థం దాని విగ్రహం ఏర్పాటు చేశారు. ఏటా మనుషులకు జరిపినట్లే శాస్త్రోక్తంగా వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. బాపులపాడు మండలం అంపాపురం గ్రామానికి చెందిన రైతు సుంకర జ్ఞాన ప్రకాశరావు ఓ కుక్క పిల్లకు అంజిని అని నామకరణంచేసి తొమ్మిదేళ్లు పెంచుకున్నాడు. ఐదేళ్ల క్రితం ఆ శునకం మృతి చెందింది. అంజినిపై ప్రేమతో జ్ఞాన ప్రకాశరావు హిందూ సంప్రదాయంలో అంత్యక్రియలు నిర్వహించి, ఏటా వర్ధంతి జరుపుతున్నారు. శనివారం ఆరో వర్ధంతి నిర్వహించి అన్నదానం చేశారు.

రూ.33 లక్షలతో పైప్‌లైన్ పనులు



పెనమలూరు: మండలంలోని తాడిగడప మునిసిపాలిటీ పరిధి పోరంకి ప్రాంతంలో మంచినీటి పైప్‌లైన్ పనులను శనివారం ప్రారంభించారు. రూ.33 లక్షలతో ఈ పనులను చేపట్టామని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. ప్రభునగర్‌లో రక్షిత మంచినీటి పథకం లేదని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే స్పందించి మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. రూ.33 లక్షలతో 2.3 కిలోమీటర్ల మేర మంచినీటి పైప్‌లైన్ వేస్తున్నామని మునిసిపల్ కమిషనర్ తెలిపారు.

డ్రెయినేజీ పైప్‌లైన్‌పై అభ్యంతరం

తాడిగడప నిమ్రా కాలనీలో ఓ బిల్డర్ నిర్మించిన గ్రూప్ హౌస్‌లో మురుగు నీరు శ్రీనివాసానగర్ కాలువ కట్ట మీదగా బందరు కాలువలో కలపటానికి వేస్తున్న డ్రెయినేజీ పైప్‌లైన్ పనులను స్థానికులు అడ్డుకున్నారు. శ్రీనివాసానగర్ వాసులు, సీపీఎం నేతలు కాశిం, మస్తాన్‌వలి ఈ మేరకు తాడిగడప కమిషర్ ప్రకాశరావుకు ఫిర్యాదు చేశారు. కమిషనర్ పైప్‌లైన్ పనులు నిలుపుదల చేయించారు.

25న జిల్లా రోప్ స్కిప్పింగ్ ఎంపికలు

కంకిపాడు: ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ ఎంపిక ప్రక్రియ ఈ నెల 25న ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో జరుగుతుందని సంఘ జిల్లాకార్యదర్శి ఎం.వెంకటేష్ శనివారం తెలిపారు. అండర్-8, 10, 12, 14, 17 బాల బాలికల విభాగాల్లో జిల్లా స్థాయి స్కిప్పింగ్ ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29, 30 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.